ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 22.05.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రైతు సంక్షేమమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని, కనీస మద్దతు ధరతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

2. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగడం లేదని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు అన్నారు.

3. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షతన పార్టీ ప్రజా ప్రతినిధుల సమీక్షా సమావేశం ఈరోజు జరిగింది. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రామచందర్ రావు కోరారు.

4. ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో భాగంగా ఈరోజు రాత్రి ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

**శ్రీధర్ బాబు**

రైతు సంక్షేమమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని, వరి, మొక్కజొన్న పంటలను చివరి గింజ వరకు కనీస మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రైతులు పండించిన మొత్తం పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన రవాణా ఏర్పాట్లు ప్రభుత్వం సిద్ధం చేసిందని మంత్రి వెల్లడించారు.

అలాగే హమాలీలు, గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు, తదితర మౌలిక సదుపాయాలు కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. రైతులు అధికారులకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

పీటీసీ, పెద్దపల్లి

**తారక రామారావు**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగడం లేదని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు అన్నారు. ఈరోజు తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయిందని, ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాకుండా, క్షేత్రస్థాయిలో పరిస్థితిని చూసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూడా నిరసనల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ తక్షణమే చెల్లించాలని, మరణించిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తారక రామారావు డిమాండ్ చేశారు.

BYTE … KTR

డెస్క్

**కవిత అరెస్ట్**

ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈరోజు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత నేతృత్వంలో కార్యకర్తలు సచివాలయం ముట్టడికి యత్నించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోతోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ తక్షణమే చెల్లించాలని కవిత డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని, కవితతో పాటు పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

డెస్క్

**రాంచందర్ రావు**

హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షతన బీజేపీ ప్రజా ప్రతినిధుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రజాపోరాటాలు, రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

పిటిసి, హైదరాబాద్

**రాజ్యసభ**

దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన 24 రాజ్యసభ స్థానాల భర్తీకి ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ స్థానాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యుల పదవీకాలం వచ్చే నెల నుండి జూలై మధ్య ముగియనుండటంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. జూన్ 1వ తేదీన అధికారికంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. జూన్ 18వ తేదీన ఉదయం నుండి సాయంత్రం వరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ ముగిసిన వెంటనే అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఏపీ నుంచి ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్‌ల పదవీ కాలం జూన్ 26న ముగియనుంది. దీంతో ఏపీలోని నాలుగు స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరగనున్నాయి.

డెస్క్

**చైర్మన్ శివసేన రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణితో మాట్లాడుతూ...

బైట్ : చైర్మన్ శివసేన రెడ్డి

పిటిసి, వనపర్తి

**మెదక్ జిల్లా కలెక్టర్**

పర్యాటక వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నేపథ్యంలో ఈ ఉదయం మెదక్ దాయార పురాతన కట్టడాలైన బావి, దేవాలయాలను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పర్యాటక శోభ సంతరించే విధంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పర్యాటక ప్రాంతాలను తుది రూపు తీసుకువచ్చే విధంగా అధికారుల సమన్వయంతో మౌలిక వసతుల కల్పనపై పటిష్ట చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

పిటిసి, మెదక్

**బెస్ట్ అవైలబుల్ స్కూల్**

2026-2027 విద్యా సంవత్సరానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలో బెస్ట్ అవైలబుల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్స్ 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. ఎస్సీ కులానికి చెందిన 46 మంది విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశానికి అవకాశం ఉందని వివరించారు. అర్హులు జూన్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ సమక్షంలో డ్రా పద్ధతిలో జూన్ 10న ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**TGNPDCL**

తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు, సాంకేతిక పరంగా మరిన్ని సేవలను జోడిస్తూ సరికొత్త మొబైల్ యాప్‌ను రూపొందించింది. వినియోగదారుల సౌకర్యార్థం మొత్తం 28 రకాల ప్రత్యేక ఫీచర్లతో ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. ఈ కొత్త యాప్ ద్వారా వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ఇంట్లోనే కూర్చుని నాణ్యమైన సేవలు పొందవచ్చని ఆయన వివరించారు. ఈ యాప్‌లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయడం, కొత్త ఫిర్యాదుల నమోదు, ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవడం వంటి సేవలు ఉన్నాయి. వీటితో పాటు ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు, బిల్ హిస్టరీ, వినియోగదారుల నెలవారీ బిల్లుల సమాచారం, ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ లాంటి 28 రకాల కీలక సేవలను ఇందులో పొందుపరిచారు.

PTC, ASF

**ఐపీఎల్**

ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో భాగంగా ఈరోజు రాత్రి హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య కీలక మ్యాచ్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు, క్రీడా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఉప్పల్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నందున, మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు ఈరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి అర్ధరాత్రి వరకు ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధించారు. లారీలు, ట్రక్కులు, ప్రైవేట్ బస్సులు వంటి భారీ వాహనాలను ఉప్పల్ పరిసర ప్రాంతాల్లోకి అనుమతించడం లేదు.

డెస్క్

**వాతావరణం**

అసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రత కొనసాగుతోంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా అత్యధికంగా కౌటాలలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా 15 మండలాల్లో రెడ్ అలర్ట్ కొనసాగుతోంది. మరో కొన్ని రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందన్న

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమయ్యింది. మధ్యాహ్నం పూట బయటకి రాకూడదు అంటూ హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, ఎక్కడికక్కడ తాగునీటి కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

పిటిసి, ఆసిఫాబాద్